క్లుప్తంగా

మంత్రి జూపల్లికి కృతజ్ఞతలు

చిన్నంబావి: మండలంలోని లక్ష్మీపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.నాలుగు లక్షల నిధులు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంజూరు చేయడంతో ఆయనకు గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ కృష్ణప్రసాద్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మంత్రికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శికి నిధుల మంజూరు ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ఎక్కువగా దొంగతనాలు జరుగుతున్నాయని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా సీసీ కెమెరాలు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని మంత్రికి 15రోజుల కిందట గ్రామస్తులు వివరించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కోసం తన సొంత నిధుల నుంచి మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఇటిక్యాల శేఖర్, రవీందర్‌గౌడ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లికి చెందిన ముగ్గురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం మాజీ జెడ్పీటీసీ రవికుమార్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. గ్రామానికి చెందిన చింతకుంట లక్ష్మయ్యకు రూ.48,500, కమ్మరి ఆంజనేయులుకు రూ.22,500, కావలి శ్రీనుకు రూ.17,500 చెక్కులు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. చెక్కులు మంజూరు చేయించిన మంత్రి జూపల్లికి, మంజూరుకు కృషి చేసిన మండల కాంగ్రెస్ నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుజీవన్, గోపాల్‌రెడ్డి, కరాటే గోపాల్, మహేష్, నాగిరెడ్డి, జూపల్లి యువసేన నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

ఖిల్లాఘనపురం: మండలంలోని కమాలోద్దీన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం జిల్లా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి టై, బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు వెంకట్‌రెడ్డి, కమలయ్య, వెంకటయ్య పలువురు గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి



వీపనగండ్ల: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో డ్రెయినేజీ లేకపోవడంతో రోడ్లపైకి మురుగు చేరి దుర్గంధభరితంగా మారుతున్నాయని శ్రీరామాంజనేయ యూత్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ శ్రీనివాసరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి అవసరమైన చోట సైడ్ డ్రెయినేజీ నిర్మించాలని యూత్ కమిటీ సభ్యులు కోరారు.

మెరుగైన వైద్యం అందించాలి



వీపనగండ్ల: ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా అందుతున్న వైద్య వసతులపై గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వివరించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.ఝాన్సీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య మహిళా రిజిస్టర్, ఈడీడీ క్యాలెండర్, హెచ్‌బీఎన్‌సీ రిజిస్టర్లను తనిఖీ చేసి సాధారణ కాన్పుల సంఖ్యను పెంచాలని ఆమె వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాజశేఖర్, నర్సింగ్ ఆఫీసర్ చందునాయక్, రాఘవేందర్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సందర్శన

బిజినేపల్లి: మండల కేంద్రంలో మంగళవారం జాతీయ జనాభా పరిశోధన బృందం సభ్యులు పీహెచ్‌సీని సందర్శించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో జాతీయ బృందం సభ్యులు డా.మాళవిక, కవితలు మాట్లాడి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్ ఆధ్వర్యంలో ఆస్పత్రికి సంబంధించిన పలు రికార్డులను, రిపోర్టులను తనిఖీ చేశారు.



చంద్రగఢ్‌లో మాట్లాడుతున్న డీపీఓ సురేష్ కుమార్



పాలెంలో..



అమరచింత రెండో వార్డులో..

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 4 పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అర్హులందరికీ అందుతాయని డీపీఓ సురేష్, డీఆర్‌డీఓ ఉమాదేవి తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో భాగంగా మంగళవారం నుంచి జిల్లావ్యాప్తంగా గ్రామసభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలను అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకటించిన రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసాలో జాబితాలో పేర్లు లేని అర్హులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఇప్పుడు ప్రకటించినది తుది జాబితా కాదని, ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

■ గోపాల్‌పేట మండల కేంద్రంలోని రచ్చకట్ట వద్ద నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభకు హాజరైన ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి మండలాల ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి, పట్టణ అధ్యక్షుడు శివన్న, ఉపాధ్యక్షుడు నాగేశ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు. గోపాల్‌పేట మండలంలోని మూడు గ్రామాల నుంచి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 305 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. రేవల్లి మండలంలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 423 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ నరసింహారెడ్డి తెలిపారు.

■ కొత్తకోట మున్సిపల్ కేంద్రంలోని చావిడి వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన ప్రజాపాలనకు ముఖ్య అతిథిగా మదనాపురం మార్కెట్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ హాజరై అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, చైర్‌పర్సన్ సుకేశిని విశ్వేశ్వర్, సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్, వార్డు కౌన్సిలర్ రవీందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ డాక్టర్ పీజే



గోపాల్‌పేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి



లక్ష్మీపల్లిలో..

బాబు, భరత్‌భూషణ్, సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ పెబ్బేరు మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ కరుణశ్రీ ఆధ్వర్యంలో 1, 2, 9, 10వ వార్డుల్లో లబ్ధిదారుల నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కర్రెస్వామి, మార్కెట్ చైర్‌పర్సన్ గౌని ప్రమోదిని రెడ్డి, కౌన్సిలర్లు పార్వతిదేవి, అశ్విని, పద్మ, కమిషనర్ గణేష్‌బాబు, తహసీల్దార్ లక్ష్మి, స్పెషల్ ఆఫీసర్ మీరాజ్‌అహ్మద్, శిరీష ఉన్నారు.

■ అమరచింత మున్సిపాలిటీలోని 1, 2, 4, 6, 9 వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ ఆధ్వర్యంలో నాలుగు పథకాల లబ్ధిదారుల వివరాలు ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, కమిషనర్ నురుల్‌నదీం తదితరులు పాల్గొన్నారు.

■ అమరచింత మండలంలోని చంద్రగఢ్‌లో మండల స్పెషల్ ఆఫీసర్, డీపీఓ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి లబ్ధిదారుల జాబితా ప్రకటించారు. మొదటి రోజు మండలంలోని చింతరెడ్డిపల్లి, ఈర్లదిన్నె, నందిమళ్ల ఎక్స్‌రోడ్, ధర్మాపురం, కొంకన్‌వానిపల్లిలో గ్రామ సభలు నిర్వహించి అర్హుల జాబితాలు విడుదల చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ నరసింహులు, డీటీ రెడ్యానాయక్, ఏఓ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

■ పాన్‌గల్ మండలంలోని అన్నారం, అన్నారంతండా, బహదూర్‌గూడెం, బండపల్లి, బుసిరెడ్డిపల్లి, దావాజిపల్లి, దొందాయిపల్లి, కదిరెపాడు, శాగాపూర్‌తండా, తెల్లరాళ్లపల్లితండాలో గ్రామ సభలు నిర్వహించారు.

■ కొత్తకోట మండంలోని పాలెం, నిర్వేన్ గ్రామసభల్లో ఎంపీడీఓ చెన్నమ్మతో పాటు ఇతర అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొని ప్రజల సలహాలు తీసుకున్నారు. గ్రామస్తులందరి సమక్షంలోనే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని, అర్హులు ఆందోళన చెందొద్దన్నారు.

■వీపనగండ్ల మండలంలోని బొల్లారం, గోపల్‌దిన్నె, కొర్లకుంట, నాగర్లబండతండా, రంగవరం, సంపత్‌రావుపల్లి, వీపనగండ్ల గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,300 మంది, రేషన్‌కార్డుల కోసం 455 మంది, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 261 మంది దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. సాగుకు యోగ్యం కాని 264 మంది రైతుల భూములను రైతు భరోసా పథకం నుంచి తొలగించామన్నారు. గ్రామసభల్లో తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏఓ డాకేశ్వర్‌గౌడ్, ఎంఈఓ నర్సింహులు, డీటీ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

■ చిన్నంబావి మండలంలోని అయ్యవారిపల్లి, అమ్మాయపల్లి, లక్ష్మీపల్లి, కొప్పునూరు, వెలగొండ, మియాపూర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి పథకాల లబ్ధిదారుల జాబితా విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణరావు, తహసీల్దార్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

■ ఆత్మకూర్ మండలంలోని దేవరపల్లి, మూలమళ్ల, బాలకిష్టాపురం గ్రామాలతో పాటు మున్సిపాలిటీలోని 1, 5 వార్డుల్లో ప్రజాపాలన సభలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి, తహసీల్దార్ చాంద్‌పాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ శశిధర్, ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, ఏఓ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

■ వనపర్తి మండలంలోని అచ్యుతాపురం, అంజనగిరి, గుంతతండా, పడమటితండా, పెద్దతండా (డి), కడుకుంట్ల, అప్పాయిపల్లి, చిమనగుంటపల్లి, చిట్యాల, నాచహల్లి గ్రామాల్లో మంగళవారం ప్రత్యేక అధికారుల సమక్షంలో గ్రామసభలు నిర్వహించారు.



వీపనగండ్లలో..

అర్హులకే..

కొత్తకోట: మండలంలోని కానాయిపల్లిలో నిర్వహించిన గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులకే అందించాలనే సంకల్పంతో అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి సర్వే చేపట్టి లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని తెలిపారు. ఈ జాబితాలో ఇంకా ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే గ్రామసభలో అందరి అభిప్రాయాలు తీసుకొని నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు, ప్రజలు, తదితరులు ఉన్నారు.



పెబ్బేరులో..



చిట్యాలలో..



బాలకిష్టాపూర్‌లో..



పాన్‌గల్ మండలం అన్నారంతండాలో ఆరుబయట ఎండలో నిలబడిన గిరిజనులు

బీరం సుబ్బారెడ్డిపై చర్యలు తీసుకోవాలి

వనపర్తి విద్యావిభాగం: వనపర్తి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి (డీబీసీడబ్ల్యూఓ) బీరం సుబ్బారెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తయానా, ప్రవీణ్, రాజు, గణేష్, రాజశేఖర్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

ఆక్రమణలపై చర్యలేవి?



కొత్తకోట రూరల్: గతేడాది ఓ చికెన్ కంపెనీ ప్రభుత్వ భూమిని ఆక్రమించిందని చెప్పి.. ఇప్పుడు లేదంటారా అని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ మండల రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అందుబాటులో లేకపోవటంతో ఆర్‌ఐతో మాట్లాడిన అనంతరం మాట్లాడుతూ ఎవరి ప్రయోజనాలు కాపాడేందుకు పెద్దమండడి రెవెన్యూ అధికారులు ప్రయత్నిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్నా చర్యలు తీసుకోవడానికి ఎందుకు జంకుతున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో తిరుపతయ్యయాదవ్, వీవీ గౌడ్, అన్నెల రమేష్‌సాగర్, బత్తుల జితేందర్‌గౌడ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కోశాధికారులకు సన్మానం



పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు ఇటుకూరు బిచ్చయ్య శెట్టి, జిల్లా కోశాధికారి బుస్స రమేష్ ను మంగళవారం కొత్తకోట ఆర్యవైశ్య సంఘం మహిళలు ఘనంగా సన్మానించారు. కొత్తకోట మాజీ ఎంపీపీ, జిల్లా ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలు గుంత మౌనిక ఆధ్వర్యంలో దాదాపు 30 మంది మహిళలు వీరిని సన్మానించారు. ఈ సందర్భంగా బుచ్చయ్య శెట్టి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో ఆర్యవైశ్యుల అభ్యున్నతికి శక్తి వంచనా లేకుండా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రసన్నలక్ష్మి, స్నేహ, రాధిక, స్వప్న, శ్రీలత, కవిత, సంధ్య, లక్ష్మి, జ్యోతి, శంకర్, విజయ్‌కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బడి బయటి పిల్లల గుర్తింపు



గోపాల్‌పేట సమీపంలోని ఇటుకబట్టీ వద్ద ఉన్న విద్యార్థులు



పాన్‌గల్‌లో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సీఆర్పీలు

ఆత్మకూర్/పాన్‌గల్: మండలంలోని ఆయా గ్రామాల్లో బడి బయటి విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పించే కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుందని సీఆర్పీ సౌమ్య అన్నారు. మంగళవారం ఆత్మకూర్ పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో పర్యటించి బడి బయటి విద్యార్థుల వివరాలతో వారి తల్లిదండ్రులను కలిసి విద్య యొక్క ప్రాముఖ్యత వివరించారు.

● పాన్‌గల్, అన్నారం గ్రామాల్లోని ఇటుక బట్టీల ప్రాంతాలను సీఆర్పీలు సందర్శించి బడిఈడు పిల్లలను గుర్తించి వారిని బడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీలు గోవింద్‌నాయక్, రమాదేవి, భార్గవి, ఐఈఆర్పీ సంతోష్, చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సోషల్ వర్కర్ నరేందర్ పాల్గొన్నారు.

● గోపాల్‌పేట మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ఇటుకబట్టీ వద్ద మంగళవారం ఒడిశా రాష్ట్రానికి చెందిన బడిఈడు పిల్లలను గుర్తించామని ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఇటుక బట్టీ వద్దకు వెళ్లి పరిశీలించగా.. పిల్లలు కనిపించారని తెలిపారు. వారి సమాచారం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పుస్తకాలు, ఇతర వస్తువులను విద్యార్థులకు అందిస్తామని తెలిపారు. అలాగే నర్సింగాయపల్లిలో ఐదో తరగతి, రెండో తరగతి చదివి బడి మానేసిన విద్యార్థులను గుర్తించామని, వారి తల్లిదండ్రులతో మాట్లాడి రెండు రోజుల్లో బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంఈఓ వెంట సీఆర్పీ చంద్రశేఖర్ ఉన్నారు.

ఇంటి కొనుగోలు విషయంలో ట్రాన్స్‌జెండర్‌కు బెదిరింపులు



మాట్లాడుతున్న ట్రాన్స్‌జెండర్ రమ్యారెడ్డి

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలో ఓ కాంగ్రెస్ నాయకుడి వద్ద రూ.72లక్షలతో ఇంటిని కొనుగోలు చేస్తే అనవసర వివాదాలు సృష్టించి తనకు న్యాయం చేయడం లేదని ట్రాన్స్‌జెండర్ రమ్యారెడ్డి ఆరోపించారు. ఆమె మాట్లాడుతూ.. ఇంటి కొనుగోలు ఒప్పందంలో ముందు మాట్లాడుకున్న ప్రకారంగా కాంగ్రెస్ నాయకుడు నడుచుకోకుండా తన వెనుక ఎమ్మెల్యే ఉన్నాడని, కొందరు నాయకులతో కలిసి బెదిరింపులకు పాల్పడుతున్నారని సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు గుప్పిస్తున్న వీడియో జిల్లా కేంద్రంలో వైరలవుతుంది. తాను కాంగ్రెస్ నాయకుడి నుంచి కొనుగోలు చేసిన ఇంటి కోసం నగదుగా రూ.లక్షలు ఇవ్వడంతో పాటుగా మూడెకరాల భూమిని సైతం రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చామని, ఆ భూమిలో ఉండే లోపాలను సరిదిద్దుకునేందుకు అదనంగా అడిగిన రూ.9లక్షలు ఇస్తామని ఒప్పుకున్నా.. కాంగ్రెస్ నాయకులు ఇంటి విషయంలో ఇబ్బందులకు గురిచేస్తున్నారని కొందరి పేర్లను ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశారు. ఘటనపై ఎమ్మెల్యే మేఘారెడ్డి స్పందించి, తనకు న్యాయం చేయాలని రమ్యారెడ్డి కోరుతున్నారు. ఈ విషయంపై కాంగ్రెస్ నాయకులు స్పందిస్తూ వ్యక్తిగత లావాదేవిల అంశాలకు ఎమ్మెల్యేను, కాంగ్రెస్ పార్టీని లాగొద్దని హితవు పలికడంతో పాటుగా మంగళవారం రాత్రి ఇందుకు సంబంధించి ట్రాన్స్ జెండర్‌తో చర్చలు జరిపినట్లు సమాచారం.

ఇళ్ల మధ్యే మురుగు



అమరచింత: మండలంలోని నందిమళ్ల గ్రామంలో డ్రెయినేజీ నుంచి మురుగు వచ్చి ఇళ్లలోకి చేరడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామ ప్రత్యేక అధికారిగా ఎంపీడీఓ శ్రీనివాసులు ఉన్నా గ్రామ సమస్యలను పట్టించుకోవడం లేదని, కనీసం గ్రామంలోని కాలనీలను సందర్శించట్లేదని ధ్వజమెత్తారు. మురుగు నీరు ఇళ్లలోకి చేరడమే కాకుండా విషపురుగులు సంచరిస్తుండడంతో భయాందోళనల నడుమ నెట్టుకొస్తున్నామని వాపోయారు. పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా ఏనాడు మురుగు మళ్లించే ప్రయత్నం చేయలేదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించామన్నామని పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

కొల్లాపూర్: మండలంలోని సున్నపుతండా, బోడబండతండాలలో మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. 300 లీటర్ల బెల్లం ఊటను, 20 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. ఎంగంపల్లి తండా నుంచి పెంట్లవెల్లి మండల కేంద్రానికి స్కూటీపై ఇద్దరు వ్యక్తులు తీసుకొస్తున్న 6 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. వారి ఫోన్లను, స్కూటీని సీజ్ చేశారు. నిందితులను ఆయా మండలాల తహసీల్దార్ల సమక్షంలో బైండోవర్ చేశారు. తనిఖీల్లో కొల్లాపూర్ ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి, గద్వాల్ టాస్క్‌ఫోర్స్ సీఐసైదిరెడ్డి, ఎస్‌ఐలు హన్మంతు, మురళి తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీలకు సౌమ్య

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని టి.సౌమ్య రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం విజయ్ మంగళవారం తెలిపారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో పాన్‌గల్ విద్యార్థిని ప్రతిభ చూపి జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించి, రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా పరీక్షల విభాగం కన్వీనర్ చంద్రశేఖర్ చేతుల మీదుగా విద్యార్థిని బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా వారు విద్యార్థిని అభినందించారు. ఈనెల 31వ తేదీన హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున విద్యార్థిని పాల్గొంటుందన్నారు. గైడ్ టీచర్స్‌గా వ్యవహరించిన పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు కిరణ్ కుమార్, శ్రీలత, ఆనంద్‌బాబు ను జిల్లా అధికారులు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం అభినందించారు.



జిల్లా అధికారుల చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థి సౌమ్య, గైడ్ టీచర్లు

శ్రీకృష్ణ ఆలయానికి ఆరోగ్య వాకింగ్ క్లబ్ విరాళం



విరాళం అందజేస్తున్న ఆరోగ్య వాకింగ్ క్లబ్ సభ్యులు

కొత్తకోట: పట్టణ సమీపంలో నూతనంగా నిర్మించబడి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న శ్రీకృష్ణ ఆలయానికి కొత్తకోట ఆరోగ్య వాకింగ్ క్లబ్ అధ్యక్షుడు పి.శేఖర్‌గౌడ్ చేతుల మీదుగా సభ్యులు మంగళవారం ఉదయం ఆలయ నిర్వాహకులకు రూ.51,116లు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ ఆలయ సభ్యులు మాట్లాడుతూ సుమారు రూ.2.5 కోట్లతో నిర్మించిన ఆలయానికి కొత్తకోట పరిసర ప్రాంత ప్రజలు ఎంతో చేయూతను అందించారని కొనియాడారు. ఫిబ్రవరిలో ఆలయ ప్రారంభోత్సవం ఉంటుందని, ఈ కార్యక్రమానికి శ్రీకృష్ణ భక్తులందరూ వేల సంఖ్యలో హాజరు కావాలని కోరారు. అనంతరం ఆలయ ప్రారంభోత్సవానికి ఆరోగ్య వాకింగ్ క్లబ్ సభ్యులను వారు ప్రత్యేకంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో శేఖర్‌గౌడ్, సత్యంయాదవ్, బాల కొండయ్య, రాములు, ఎల్లయ్య, ఆంజనేయులు, భీమ రవి, రామకృష్ణ, బాలరాజు, ఊషన్న, శ్రీను, రాజేష్, కృష్ణ, అంజన్న, ముంత రవి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

వీపనగండ్ల: గ్రామాల్లోని పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని జెండర్ ఈక్వల్–1 శ్రీవాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బేటీ బచావో బేటీ పడావో అనే కార్యక్రమంలో ఆమె పాల్గొని బాలబాలికలకు పలు సూచనలు ఇచ్చారు. బాలికల విద్యా పరిరక్షణ, మహిళా సాధికారిత, పోక్సో, గృహహింస చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉన్నప్పుడే వాటిని ఉపయోగించుకునే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం భానుప్రకాష్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శ్రీవాణి